

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

● ప్రార్థనల అనంతరం దీక్షల విరమణ

ప్యారీస్, మార్చి 29: ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే పర్వదినాల్లో ఒకటైన శుభ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్ని చర్చిల్లో విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. బిషప్‌లు, ఫాదర్లు, పాస్టర్లు, క్రైస్తవ మత గురువులు, సీనియర్ బోధకులు గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని చర్చిల భక్తులతో కిటకిటలాడాయి. 40 రోజులుగా ఉపవాసదీక్షలతో ఉన్న క్రైస్తవులు గుడ్ ఫ్రైడే ప్రార్థనల అనంతరం పండ్ల రసం తీసుకుని దీక్షలు విరమించారు. నాగపట్టణం జిల్లా వేలాంకన్నిలో ఉన్న పునీత ఆరోగ్య మాత ఆలయంలో యేసుక్రీస్తు శిలువ కొయ్యను మోస్తూ పడిన కష్టాలను శిలువ మార్గం పేరుతో దృశ్యాలను కళ్లకు కట్టినట్లుగా కళాకారులు ప్రదర్శించారు. అదే విధంగా తిరువారూర్ జిల్లా పూండిలోని సెయింట్ మేరీమాత ఆలయం, తిరుచ్చి సెయింట్ పీటర్స్ ఆలయం, తూత్తుకుడి జీసస్ చర్చి, స్థానిక శాంథోమ్ చర్చి, బీసెంట్‌నగర్ వేలాంకన్ని చర్చి, జెమిని కెథడ్రల్ చర్చి, రాయపేట వెస్లీ చర్చి, పెరంబూర్ లూర్థుమాత చర్చి, వెప్పేరి సెయింట్ పాల్ చర్చిలు సహా క్యాథలిక్, సీఎస్ఐ, ఈసీఐ, మారనాథ, లూథరన్ చర్చీల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



యేసుప్రభువు ప్రతిమను వీక్షిస్తున్న భక్తులు



గుడ్ ఫ్రైడే ప్రార్థనలకు హాజరైన భక్తులు



ధర్మపురి ప్రచారసభలో ప్రసంగిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్



సభకు హాజరైన జనం

'ఇండియా'నే గెలిపించండి

అపవిత్ర కూటమిలో పీఎంకే ● ధర్మపురి సభలో సీఎం స్టాలిన్ పిలుపు

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని వ్యవస్థలు సక్రమంగా ఉండాలన్నా, ప్రజాస్వామ్యం బ్రతకాలన్నా ఇండియా కూటమిని గెలింపించాల్సిన బాధ్యత భారతీయులందరిపైనా ఉందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. సామాజిక న్యాయమంటే ఏమాత్రం తెలియని మతతత్త్వపార్టీ బీజేపీతో ప్రజాస్వామ్యానికి ముప్పువాటిల్లనుందని, ఆ పార్టీకి మూడోసారి అధికారం కట్టబెడితే ప్రజలు భయంతో బ్రతకాల్సి ఉంటుందని, మైనారిటీలకు భద్రత ఉండదన్నారు. ధర్మపురిలో శుక్రవారం సాయంత్రం ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తాను ఎక్కడికి వెళ్ళినా మహిళలంతా తనను వారి కుటుంబంలో ఒక్కడిగానే ఆదరాభిమానాలను ప్రదర్శిస్తున్నారని, ప్రతినెలా రూ.1000లు పొందుతున్న గృహిణులు స్టాలిన్ అన్నయ్య తమకు పుట్టింటి కానుకగా వెయ్యిరూపాయలు ఇస్తున్నారంటూ తెలిపి హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మూడేళ్ల డీఎంఏ ద్రావిడ తరహా పాలనలో అమలు చేసిన పథకాలే లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిని గెలిపిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అపవిత్ర కూటమి...

వన్నియార్ల రిజర్వేషన్ల అమలుకు ఏ మాత్రం సాయపడని బీజేపీతో పీఎంకే పొత్తుపెట్టుకోవడం విడ్డూరంగా ఉందని, ఆ కూటమి అపవిత్ర కూటమి అని, పార్టీ కార్యకర్తలంతా నిరసన వ్యక్తం చేస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. వన్నియార్లకు రిజర్వేషన్ల కోసం పీఎంకే చేసిన ఉద్యమం గురించి అన్నాడీఎంకే ఏ మాత్రం పట్టించుకోలేదని, 1989లో కరుణానిధి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన 43 రోజులలో పీఎంకే నేత రాందాస్‌ను పిలిచి మాట్లాడి వన్నియార్లు సహా ఓబీసీలకు 20 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించారని, ఈ సంగతి ఆయన మరచిపోయినట్లుందన్నారు. పీఎంకే సిద్ధాంతాలు బీజేపీ సిద్ధాంతాలతో ఏ మాత్రం పొసగవని తెలిసీ రాందాస్ ఆ కూటమిలో చేరారన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతామని పదే పదే చెప్పే రాందాస్ ఆ సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా మతతత్త్వవాదాన్ని ప్రోత్సహించి ప్రజలమధ్య చిచ్చురగిల్చే బీజేపీతో ఎలా పొత్తుపెట్టుకున్నారని ప్రశ్నించారు. మండల్ కమిషన్ సిఫారసులు అమలు చేసేందుకు ప్రయత్నించిన మాజీ ప్రధాని వీపీసింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టిన బీజేపీతో పీఎంకే ఎలా పొత్తుకు సిద్ధమైందో తనకింకా అర్థం కాలేదన్నారు. కులాలవారీ జనగణన జరిగి ఆయా కులాల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న రాందాస్‌కు కులగణనకు బీజేపీ తీవ్ర వ్యతిరేకమనే విషయం కూడా తెలియకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల సమయంలో కులగణన జరుపుతానని ప్రధాని మోదీ ఏమైనా రాందాస్‌కు గ్యారెంటీ ఇచ్చారా అని ప్రశ్నించారు. వన్నియార్ల రిజర్వేషన్ల ఉద్యమంలో 21 మంది ప్రాణత్యాగం చేశారని, రిజర్వేషన్ల కోసం అప్పటి సీఎం జయలలితను కనీసం కలుసుకోవడానికి కూడా వీలులేకపోయిందని, కరుణానిధి అధికారంలోకి వచ్చాక వన్నియార్లకు రిజర్వేషన్లు ప్రకటించి కాపాడారని, ఆ రిజర్వేషన్లు రాకుంటే వన్నియార్లంతా దినకూలీలుగా బ్రతికేవారంటూ చెప్పిన రాందాస్ ఇప్పుడెలా బీజేపీతో పొత్తుపెట్టుకున్నారో తనకు, రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

తిరుప్పరంకుండ్రంలో నేత్రపర్వంగా మహారథోత్సవం

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రధానంగా కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ప్రథమ క్షేత్రంగా పేరొందిన తిరుప్పరంకుండ్రం గంభీర సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పంగుణి మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం మహారథోత్సవం వైభవంగా జరిగింది. ఈ నెల 15న ధ్వజారోహణంతో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో పద్నాలుగు రోజులుగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవసేన సమేతుడైన ఉదయం పల్లకీలో, సాయంత్రం స్వర్ణమయూర వాహనం, స్వర్ణ అశ్వ వాహనం, భూతవాహనం, హంసవాహనం, శేషవాహనం సహా పలు వాహనాల్లో ఊరేగారు. గురువారం సుబ్రహ్మణ్యస్వామి, దేవసేనల కల్యాణోత్సవం జరిగింది. కుమారుడి వివాహానికి మదురై క్షేత్రం నుంచి మీనాక్షి, సుందరేశ్వరర్ తరలివచ్చారు. రాత్రి మీనాక్షి, సుందరేశ్వరుడి వీడ్కోలు కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో పంగుణి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉత్సవమండపంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతం సహా 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఆ తర్వాత స్వామి, అమ్మవారిని అలంకరించి వేకువజాము 5.30 గంటలకు సుబ్రహ్మస్వామి, దేవసేనలను రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఉంచగా, రథానికి ఇరువైపులా నిలిచిన భక్తులు రథం మోకుతాళ్ళను పట్టుకుని లాగారు. గిరిప్రదక్షిణ మార్గంలో వేలాదిమంది భక్తులు, మంగళవాయిద్యాలు, చండీ మేళాల వాయిద్యాల నడుమ మహారథం గంభీరంగా నాలుగు వీధుల్లోనూ ఊరేగింది. మహారథానికి ముందు చిన్న రథంలో గణపతి ఊరేగారు. ఈ రథోత్సవంలో తిరుప్పరంకుండ్రం, అవనియాపురం, నీలయూరు, కూత్తియార్ కుండు, తనక్కన్‌కుళం తదితర గ్రామాల ప్రజలు, పొరుగు జిల్లాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో విచ్చేశారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని తిరుప్పరంకుండ్రం ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, నిమ్మరసం తదితర పానీయాలను అందజేశారు. ఇదే విధంగా వివిధ భక్తజన సంఘాల ఆధ్వర్యంలో ఉచితాన్నదాన కార్యక్రమాలు కూడా జరిపారు. ఈ వేడుకల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ట్రస్టు బోర్డ్ చైర్మన్ సత్యప్రియా, సభ్యులు మణి సెల్వం, బొమ్మదేవన్,షణ్ముగసుందరం, రామయ్య, ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి సురేష్, స్థానిక పోలీసులు పటిష్ఠమైన ఏర్పాట్లు చేపట్టారు.



గిరి ప్రదక్షిణ మార్గంలో రథాన్ని లాగుతున్న భక్తులు

ఫైనాన్స్ సంస్థ ఆగడాలకు బలి

● ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి ఆత్మహత్య

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నెలవారీ వాయిదాలు సక్రమంగా చెల్లించలేదన్న కోపంతో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ సిబ్బంది దూషణలకు దిగడంతో అవమాన భారంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. తేని జిల్లా చొక్కనాధపురంలో ఈ విషాద సంఘటనకు సంబంధించి వివరాలిలా... చొక్కనాధపురంలో సెవ్వందివారన్ (60) ఓసమ్మాళ్ (57) అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి రాజేష్ (30) అనే కుమారుడున్నాడు. సెవ్వంది వీరన్ టాస్మాక్ బార్‌లో పనిచేస్తున్నాడు. రాజేష్ భార్య నుండి విడాకులు తీసుకుని తల్లిదండ్రులతోనే ఉంటున్నారు. ఈ ముగ్గురు ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ ద్వారా వాయిదాల పద్ధతిలో బైకులు, సెల్‌ఫోన్లు కొనుగోలు చేశారు. ఇటీవల ఆర్థిక పరిస్థితి బాగులేక ఫైనాన్స్ సంస్థకు సక్రమంగా వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఆ సంస్థ సిబ్బంది రెండు రోజులకు ముందు ఓసమ్మాళ్ దగ్గరకు వెళ్ళి వాయిదాలు చెల్లించలేదని దుర్భాషలాడారు. చుట్టుపక్కల వారంతా చూస్తుండగానే బైకులను, సెల్‌ఫోన్లను కూడా లాక్కెళ్ళారు. రాత్రి సెవ్వంది వీరన్, రాజేష్ ఇంటికి తిరిగొచ్చి విషయం తెలుసుకుని కలతచెందారు. అందరి ముందు ఫైనాన్స్ సంస్థ సిబ్బంది నానా దుర్భాషలాడారని, అవమానంతో బ్రతికే కన్నా చావటమే మేలని ఓసమ్మాళ్ చెప్పటంతో ముగ్గురూ ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యారు. విషం తాగి పడుకున్నారు. శుక్రవారం ఉదయం ఓసమ్మాళ్ ఇంటి లోపల నుంచి ఎలాంటి అలికిడి వినకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని ఇంటి తలుపులను పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా సెవ్వందివీరన్, ఓసమ్మాళ్, రాజేష్ నోటిలో నురగలు కక్కుకుని శవాలుగా పడి ఉండటంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తేని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న సెవ్వందివీరన్, ఓసమ్మాళ్, రాజేష్ (ఫైల్‌ఫొటో)

నేడు అభ్యర్థుల తుది జాబితా విడుదల

● చిహ్నాల కేటాయింపు

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ముగిసి, శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు కూడా ముగియనుండటంతో బరిలో మిగలనున్న అభ్యర్థుల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఈ నెల 20 ప్రారంభమై, 27 మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. గురువారం ఉదయం నుంచి నామినేషన్ల పరిశీలన జరిగింది. 39 నియోజకవర్గాలకు గాను 1085 నామినేషన్లను ఆమోదించారు. 664 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. నామినేషన్ల పరిశీలన తర్వాత తిరువళ్లూరులో 14, నార్త్ చెన్నైలో 49, సౌత్‌చెన్నైలో 53, సెంట్రల్ చెన్నైలో 32, శ్రీపెరుంబుదూరులో 32, కాంచీపురంలో 13, అరక్కోణంలో 29 నామినేషన్లను అంగీకరించినట్లు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఇదే విధంగా వేలూరులో 37, సేలంలో 27, నీలగిరిలో 16, కోయంబత్తూరులో 41, తిరుచ్చిలో 38, కడలూరులో 19, తంజావూరులో 13, విరుదునగర్‌లో 27, తూత్తుకుడిలో 31, కన్నియాకుమారిలో 27 నామినేషన్లను ఆమోదించారు. ఇక శుక్రవారం గుడ్‌ఫ్రైడే సెలవు కావడంతో నామినేషన్ల ఉపసంహరణకు వీలులేకపోయింది. శనివారం ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు ఎన్నికల అధికారులు అనుమతించనున్నారు. ఆ తర్వాత చిహ్నాలు లేని పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులకు చిహ్నాలను కేటాయించనున్నారు. తరవాఆత అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేస్తారు. డీఎంకే కూటమిలోని ఎండీఎంకే, డీపీఐ అభ్యర్థులకు అధికారిక చిహ్నాలైన బొంగరం, కుండ గుర్తులను కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించలేదు. అభ్యర్థుల జాబితా విడుదలైన తర్వాతే ఈ రెండు పార్టీల అభ్యర్థులకు చిహ్నాలు కేటాయించనున్నారు. అభ్యర్థుల తుది జాబితా విడుదలైన తర్వాతే రాష్ట్రంలో ప్రధాన పార్టీల ప్రచారం తీవ్రతరం కానుంది. 18 రోజులపాటు ప్రధాన రాజకీయపార్టీల నేతలు సుడిగాలి పర్యటనలు రోడ్ షోలు, ప్రచారాలు చేయనున్నారు. ఏప్రిల్ 17 సాయంత్రం ఐదు గంటలకు ప్రచార పర్వం ముగియనుంది.



బీజేపీ పతనం రాష్ట్రం నుంచే ఆరంభం

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుందగై

ప్యారీస్, మార్చి 29: నియంత పాలన ప్రోత్సహిస్తున్న బీజేపీ సర్కారు పతనం తమిళ గడ్డపై నుంచే ఆరంభమవుతుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై జోష్యం చెప్పారు. తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో టీఎన్‌సీసీ ఉపాధ్యక్షుడు గోపన్న రాసిన కాంగ్రెస్ ప్రచార గైడ్‌ను సెల్వపెరుందగై ఆవిష్కరించగా, డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతి తొలిప్రతిని స్వీకరించారు. టీఎన్‌సీసీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ముత్తళగన్, ఎంఎస్ ద్రవ్యం, జె.డిల్లీబాబు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్న ఈ సభలో సెల్వపెరుందగై మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలకు ఎలాంటి మేలు జరుగలేదని, అవినీతి, అక్రమాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, బీజేపీ రాక్షస పాలన తీరును ఎండగడుతూ కాంగ్రెస్ తరఫున రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. గుడ్ ఫ్రైడే పర్వదినాన ఆవిష్కరించిన ఈ గైడ్‌ను పార్టీ నిర్వాహకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రులు, జిల్లా అధ్యక్షులు, పార్టీ అనుబంధ శాఖల నిర్వాహకులకు పంపిణీ చేస్తామన్నారు. దేశంలో కోటీశ్వరులనే బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహించడం వల్ల మధ్యతరగతి ప్రజలు నిరుపేదలుగా మారారని, 2019 లోక్‌సభ ఎన్నికల్లోలాగే ఈ సార్వత్రిక ఎన్నికల్లో కూడా అత్యధిక ఓట్ల మెజారిటీతో అన్ని పార్లమెంటు స్థానాలను ఇండియా కూటమి కైవసం చేసుకుంటుందని, ఇందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు.



కాంగ్రెస్ ఎన్నికల ప్రచార గైడ్ ఆవిష్కరణ సభలో సెల్వపెరుందగై, డీఎంకే నేత ఆర్ఎస్ భారతి తదితరులు

రంజాన్ వేళలు

శనివారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.27

ఆదివారం : సహర్ : ఉదయం - 4.26



డీఎంకే పాలనతో విసుగెత్తిన జనం

● 'ఎక్స్' పేజీలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజం

ప్యారీస్, మార్చి 29: డీఎంకే అసమర్థత పాలనపై విసుగెత్తిన తమిళనాడు ప్రజలు బీజేపీపై ఆశతో చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో బీజేపీ కూటమిలో ఉన్న మిత్రపక్షాలకు మద్దతుగా బీజేపీ పెద్దలు రాష్ట్రంలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ఐదు సార్లు రాష్ట్రానికి వచ్చి బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభల్లో మిత్రపక్షాల నేతలతో కలసి పాల్గొన్నారు. ఆయన మళ్లీ ప్రచారం నిమిత్తం రాష్ట్రానికి రానున్న సందర్భంగా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రధాని పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రధాని మోదీ 'ఎక్స్' పేజీలో... డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉంటూ అన్ని రాష్ట్రాల అభివృద్ధిని కాంక్షిస్తూ పథకాలు విజయవంతంగా అమలుపరుస్తున్న బీజేపీని తమిళనాడు ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. బీజేపీ పట్ల ప్రజల్లో కలిగిన నమ్మకం వల్ల పార్టీ విజయావకాశాలు ప్రకాశవంతంగా ఉన్నాయని ప్రధాని మోదీ ఎక్స్ పేజీలో అభిప్రాయం వ్యక్తం చేశారు.

సమాచార దర్శిని

రేపు చెన్నై-కోవై ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, మార్చి 29: ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై-కోవై-చెన్నై మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● నెం.06050 కోయంబత్తూర్-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 31న కోయంబత్తూర్‌లో రాత్రి 11.30 గంటటకు బయేల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. అలాగే, నెం.06049 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-కోవై ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ ఏప్రిల్ 1వ తేది ఉదయం 10.20 గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయల్దేరి రాత్రి 8.25 గంటలకు కోవై చేరుకుంటుంది.

పరీక్షల టైం టేబుల్‌లో మార్పులు

పెరంబూర్, మార్చి 29: రంజాన్ పండుగ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల వార్షిక పరీక్షల టైం టేబుల్‌లో మార్పులు చేశారు. ఆ ప్రకారం 4 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సైన్స్ సోషల్ పరీక్షల తేదీలు మారాయి. ఆ ప్రకారం, ఏప్రిల్ 10,12 తేదీల్లో జరగాల్సిన పరీక్షలు ఏప్రిల్ 4,6 తేదీల్లో జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ తెలియజేసింది.

17, 18 తేదీల్లో 2,000 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏప్రిల్ 17,18 తేదీల్లో 2,000 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ ఒక ప్రకటలో తెలియజేసింది. ఈ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టిందన్నారు. ఓటు హక్కు వినియోగించుకొనేందుకు స్వగ్రామాలకు వెళ్లేవారి సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 17,18 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడుపున్నామని తెలిపింది. నగరం నుంచి ప్రధాన నగరాలు, జిల్లాలకు 2,000 ప్రత్యేక బస్సులు నడుపునున్నామని తెలిపింది. ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 60 రోజులు ముందుగా రిజర్వేషన్ చేసే వసతి కల్పించడంతో ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని రవాణా శాఖ విజ్ఞప్తి చేసింది.

మద్రాసు వర్సిటీ సెమిస్టర్ ఫలితాల విడుదల

పెరంబూర్, మార్చి 29: మద్రాసు విశ్వవిద్యాలయ పరిధిలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో యూజీ, పీజీ కోర్సులకు సంబంధించి 2023-24 విద్యా సంవత్సరంలో నవంబరు, డిసెంబరు సెమిస్టర్ పరీక్షలు గత ఏడాది డిసెంబరులో జరిగాయి. వాటి ఫలితాలు శుక్రవారం వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. బి.కాం పీజీ విద్యార్థులు https://egovernance.unom.ac.in/results అనే వెబ్‌సైట్, బీఏ, బీఎస్సీ, బీసీఏ, సంస్కృతం, ఉర్దూ, అరబిక్ భాషల పరీక్షా ఫలితాలు https://exam.unom.ac.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. రీ వాల్యుయేషన్‌కు కోరగోరు విద్యార్థులు ఏప్రిల్ 1 నుంచి 5వ తేదిలోపు www.unom.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలి. రీ వాల్యుయేషన్‌కు ఒక్కో పాఠ్యాంశానికి రూ.1000, రీ టోటలింగ్‌కు ఒక్కో పాఠ్యాంశానికి రూ.300 ఫీజుగా నిర్ణయించారు. ఈ ఫీజును 'రిజిస్ట్రార్, మద్రాసు విశ్వవిద్యాలయం' అనే పేరున డీడీ తీసి పంపించాలని వర్సిటీ తెలియజేసింది.

'నెట్' మార్కుల ఆధారంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు

పెరంబూర్, మార్చి 29: వచ్చే విద్యా సంవత్సరం నుంచి నెట్ మార్కుల ఆధారంగా పీహెచ్‌డీ కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు యూజీసీ కార్యదర్శి మనీష్ ఆర్.జోషి ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సహాయ ప్రొఫెసర్ల పోస్టులకు భర్తీకి సంబంధించిన అర్హత పరీక్ష, యూజీ పరిశోధన స్కాలర్‌షిప్ పొందేందుకు నెట్ ప్రతి ఏడాది జూన్, డిసెంబరు నెలల్లో నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, పలు విశ్వవిద్యాలయాలు పీహెచ్‌డీ కోర్సులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇక, జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం, 2024-25 విద్యా సంవత్సరం నుంచి పీహెచ్‌డీ కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లు నెట్ మార్కుల ఆధారంగా చేపట్టాలని, ఈ విధానం రానున్న జూన్ నుంచి అమలులోకి వస్తుందని యూజీసీ తెలియజేసింది.

మారియమ్మన్ ఆలయ హుండీ ఆదాయం రూ.57 లక్షలు

పెరంబూర్,మార్చి29: ప్రసిద్ధిచెందిన సమయపురం మారియమ్మన్ ఆలయ హుండీల లెక్కింపు గురువారం జరిగింది.ఈఆలయానికి ప్రతిరోజు స్వదేశీ, విదేశీ భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని కానుకలు సమర్పిస్తుంటారు. ఈ కానుకలను నెలకు రెండు సార్లు లెక్కిస్తుంటారు.ఆప్రకారం, హుండీల లెక్కింపులో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు రూ.57,83,822 నగదు, 1.040 కిలోల బంగారం, 1.974 కిలోల వెండి, 39 విదేశీ కరెన్సీ నోట్లు, 1,384 విదేశీ నాణేలు కానుకలుగా సమర్పించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

1 నుంచి లైఫ్ సర్టిఫికెట్ల జారీ

పెరంబూర్, మార్చి 29: ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ పదవీ విరమణ పొందినవారు, కుటుంబ పింఛన్ పొందే వారు ఏప్రిల్ 1వ తేది నుంచి లైఫ్ సర్టిఫికెట్లు పొందవచ్చని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పింఛన్ పుస్తకం, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డుతో నేరుగా సంప్రదించి లైఫ్ సర్టిఫికెట్ పొందవచ్చని జీసీసీ తెలియజేసింది.

19న వేతనంతో కూడిన సెలవు

పెరంబూర్, మార్చి 29: లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న ఏప్రిల్ 19వ తేది వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కార్మిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తమిళనాడు, పుదుచ్చేరిలోని 40 లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకే విడతలో ఈ నెల 19న పోలింగ్ జరుగనున్న విషయం తెలిసిందే. ఆ రోజు ఉద్యోగులంతా ఓటు హక్కు వినియోగించుకొనేలా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, నిబంధనలు ఉల్లఘించిన దుకాణాలు, కర్మాగారాలు, వాణిజ్య సంస్థలపై చర్యలు చేపడతామని కార్మిక సంక్షేమ శాఖ హెచ్చరించింది.

పోలీసు శిక్షణ కళాశాలలో చోరీ !

ప్యారీస్, మార్చి 29: స్థానిక అశోక్‌నగర్‌లో ఉన్న పోలీసు శిక్షణ కళాశాలలో చోరీకి యత్నించిన యువకుడిని అరెస్ట్ చేశారు. ఈ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఆర్థికనేర విభాగం ప్రధాన కార్యాలయం కూడా పనిచేస్తుంది. ఇక్కడ పలు కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, నాలుగు చక్రాల వాహనాలను ఉంచారు. ప్రతిరోజు సాయంత్రం క్రైం ఇన్‌స్పెక్టర్ నందిని నేతృత్వంలోని పోలీసులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు లెక్కిస్తుంటారు. అదే విధంగా గురువారం సాయంత్రం వాహనాలు నిలిపిన ప్రాంతంలో చొరబడిన వ్యక్తి ఓ మోటార్ సైకిల్ వెనుక చక్రాన్ని విప్పుతుండడాన్ని పోలీసులు గుర్తించారు. భారీ భద్రత ఉన్న ఆ ప్రాంతంలో చేతివాటం చూపిన ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేకేనగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విచారణలో, అతను గిండికి చెందిన దీన (21) అని తెలిసింది. అతడిని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.







వెప్పేరి తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రసంగిస్తున్న రెవ.కామేశ్వరరావు - మోడల్ లైన్‌లో నాటక ప్రదర్శించిన సండే స్కూలు చిన్నారులకు పండ్ల రసం అందిస్తున్న బ్రదర్ ఎం.ఆదాంరాజ్ - మోడల్ లైన్ తెలుగు బాప్టిస్ట్ సంఘంలో ప్రసంగిస్తున్న సంఘకాపరి ఎ.సతీష్ - పెన్షనర్స్ లైన్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక గీతాలు ఆలపిస్తున్న క్వయర్ సభ్యులు

తెలుగు చర్చిల్లో ఘనంగా శుభ శుక్రవారం

ప్యారీస్, మార్చి 29: రాజధాని నగరం చెన్నైలో తెలుగు క్రైస్తవులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లోని చర్చిల్లో శుభ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పెద్దలు, కమిటీ నిర్వాహకులు, స్త్రీల సమాజం నిర్వాహకుల పర్యవేక్షణలో శిలువ ధ్యాన ఆరాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యేసు ప్రభువు శిలువ వేసే ముందు 14 స్థలాల్లో ఏ విధంగా బాధించపడ్డారనే దృశ్యాలను నాటిక రూపంలో చిన్నారులు ప్రదర్శించారు. 40 రోజులు ఉపవాసదీక్షలు చేపట్టిన భక్తులకు చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థన అనంతరం పండ్ల రసాలు, శీతల పానీయాలు, పాయసం, భోజనం పంపిణి చేశారు.

వెప్పేరిలో... : వెప్పేరి హైరోడ్డులో ఉన్న మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘంలో కాపరి రెవ.డా.ఎస్.రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆరాధనలో నగరం నలుమూలల నుంచి తెలుగు వారు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బోధకులు ఎం.సరోజ, కె.జగన్మోహనరావు, డా.కేజే కామేశ్వరరావు, రెవ.రాజేంద్ర ప్రసాద్ శిలువపై యేసు పలికిన ఏడు మాటల సారాంశాన్ని వివరించారు. సంఘ అధ్యక్షులు వి.రామయ్య, కార్యదర్శి పోతల ప్రభుదాస్, కోశాధికారి ఎ.బాబు, సీనియర్ ప్రీచర్స్ డీకన్లు, పెద్దలు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ చర్చి... : పాత వాషర్‌మెన్‌పేట మోడల్ లైన్ సిమెట్రీ రోడ్డులో ఉన్న సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ఆరాధనలో దైవసేవకులు సీహెచ్ శాస్త్రిబాబు, ఎం.ఆదాంరాజ్ దైవ సందేశం అందించారు. కార్యక్రమంలో భాగంగా సండే స్కూలు చిన్నారులు శిలువ మార్గం అంశంపై నాటకం ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. వై.ఆంథోని, ఐ.ప్రభుదాస్, ఎం.రమేష్‌బాబు, బి.రూబెన్, ఎల్‌సీసీ సభ్యులు, స్త్రీల సమాజం, యువజన విభాగం సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ లైన్... : మోడల్ లైన్ తెలుగు బాప్టిస్ట్ సంఘంలో పాస్టర్ రెవ.ఎ.సతీష్ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక ఆరాధనలో సంఘ అధ్యక్షుడు ఎండ్లూరి జేమ్స్, కార్యదర్శి చెరుకూరి పరంజ్యోతి, ఉప కార్యదర్శులు ఎన్.యేసురత్నం, బి.రామనాథం, కోశాధికారి ఎ.ప్రసాద్‌రావు, కమిటీ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ లైన్...

పెన్షనర్స్ లైన్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సంఘకాపరి రెవ.పి.ఐజక్ అధ్యక్షతన శిలువ ధ్యానం ఆరాధన జరిగింది. సంఘ క్వయర్ బృందంకు చెందిన సభ్యులు శుభ శుక్రవారం సందర్భంగా శ్రావ్యంగా భక్తిగీతాలు ఆలపించారు. స్త్రీల సమాజం పెద్దలు, సండే స్కూలు టీచర్లు, కన్వీనర్లు, సంఘ పెద్దలు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన నిర్వాహకులు, ప్రార్థన అనంతరం భక్తులందరికి పండ్ల రసం, ఆహార పొట్లాలు పంపిణి చేశారు.



హాజరైన తెలుగు క్రైస్తవులు

పబ్‌లో కూలిన పైకప్పు

● హిజ్రా సహా ముగ్గురు మృతి



కూలిన పై కప్పు

పెరంబూర్, మార్చి 29: పబ్‌లో మద్యం ఇచ్చే ప్రాంతంలోని పైకప్పు కూలిన ఘటనలో ఓ హిజ్రా సహా ముగ్గురు మృత్యువాతపడ్డారు. స్థానిక ఆళ్వార్‌పేట సేమియర్స్ రోడ్డులో ఉన్న ఓ పబ్‌లో ఒక వైపు మద్యం సరఫరా చేసే బార్, మరో పక్క ఆహారం అందజేస్తుంటారు. ఈ పబ్ సమీపంలో మెట్రోరైలు రెండవ విడత సొరంగం తవ్వే పనులు జరుగుతున్నాయి. ఈ పబ్‌లో గురువారం రాత్రి యువతీ, యువకులు మొత్తం 30 మంది వరకు ఉన్నారు. ఆ సమయంలో హఠాత్తుగా మద్యం సరఫరా చేసే ప్రాంతంలోని పైకప్పు కూలిపడింది. ఈ ఘటనలో మద్యం బార్ ఉద్యోగి దిండుగల్‌కు చెందిన సైక్లోన్ రాజ్ (48) మణిపూర్‌కు చెందిన హిజ్రా లల్లి (24), మేక్స్ (25)లు పైకప్పు శిథిలాల్లో చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న మైలాపూర్, తేనాంపేట తదితర ప్రాంతాల నుంచి 3 వాహనాలతో అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని శిథిలాలు తొలగించే పనులు చేపట్టారు. శిథిలాల తొలగింపు అనంతరం మృతిచెందిన ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అభిరామపురం పోలీసులు కేసు నమోదుచేసి పబ్ యజమాని, మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనాస్థలాన్ని కార్పొరేషన్ కమిషన్ డా.జె.రాధాకృష్ణన్ పరిశీలించి, ఆ భవనానికి సీలు వేయాలని ఆదేశించారు. కాగా, మెట్రోరైలు పనులకు పబ్ పైకప్పు కూలిన ఘటనకు సంబంధం లేదని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ప్రకటించింది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొనేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటుచేసినట్లు నగర పోలీసు శాఖ తూర్పు మండల డిప్యూటీ కమిషనర్ జి.దర్మరాజన్ తెలిపారు.

మంత్రి శివశంకర్ వాహనం తనిఖీ



మంత్రి కారును తనిఖీ చేస్తున్న అధికారులు

పెరంబూర్, మార్చి 29: రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ కారును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా అరియలూరు జిల్లా జయంకొండాంలో శుక్రవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి శివశంకర్ అరియలూరు నుంచి కారులో బయల్దేరారు. జయంకొండాం సమీపం అసినాపురం ప్రాంతంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. అధికారులను గమనించి మంత్రి కారు డ్రైవర్ వాహనాన్ని నిలిపివేశాడు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు కారులో మంత్రి ఉన్నట్టు గమనించి, వెళ్లాలని డ్రైవర్‌కు సూచించారు. అంతలో జోక్యం చేసుకున్న మంత్రి, మీ విధులు నిర్వహించండి అంటూ తెలిపి కారు తలుపులు తెరిచి తనిఖీలు చేపట్టాలని కోరారు. వాహనంలో అనుమానించాల్సిన వస్తువులు లేకపోవడంతో అధికారులు కారును వెళ్లేందుకు అనుమతించారు.

మోదీ పాలనలో మూతపడుతున్న పరిశ్రమలు

● డీఎండీకే నాయకురాలు ప్రేమలత



కోవైలో ప్రచారం చేస్తున్న ప్రేమలత

అడయార్, మార్చి 29: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో పరిశ్రమలు మూతపడుతున్నాయని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే ఉండటంతో ఆ కూట మి అభ్యర్థుల తరఫున ఆమె ప్రచారం చేస్తున్నారు. ఇందులోభాగంగా ఆమె కోయంబత్తూరు అన్నాడీఎంకే అభ్యర్థి తరఫున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకపుడు కోయంబత్తూరు రాష్ట్రానికి మినీ పారిశ్రామికవాడగా ఉండేదన్నారు. ఇపుడు ఇక్కడ ఉన్న అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. దీనికి కారణం మోదీ ప్రభుత్వమన్నారు. జీఎస్టీ విధానంతో అనేక పరిశ్రమలు మూతపడగా, వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు.

షోలింగర్‌లో పీఎంకే అభ్యర్థి పరిచయ సభ

వేలూరు, మార్చి 29: షోలింగర్ బస్టాండ్, ముత్తుకడై బస్టాండ్ ప్రాంతాల్లో అరక్కోణం పార్లమెంటు నియోజకవర్గంలో పీఎంకే తరపున పోటీచేస్తున్న న్యాయవాది బాలు పరిచయ సభ గురువారం సాయంత్రం జరిగింది. ఈ సభలో పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ పాల్గొని, రాష్ట్రాభివృద్ధికి పీఎంకే అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సభలో మాజీ మంత్రులు అరంగవేలు, ఎస్టీ షణ్ముగ, జిల్లా సెక్రటరీలు శరవణన్, ఇళవయగన్, ఉప సెక్రటరీలు కృష్ణన్, చక్రవర్తి, పుదియ నీది పార్టీ అధ్యక్షులు ఏసీ షణ్ముగం, ఏఎంఎంకే రాష్ట్ర అవై అధ్యక్షుడు గోపాల్ తదితరులున్నారు.

అన్నాడీఎంకేను ఆదరించండి

● మాజీ మంత్రి వీరమణి



ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి వీరమణి

వేలూరు, మార్చి 29: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థి డా.పసుపతిని ఆదరించాలని మాజీ మంత్రి వీరమణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గుడియాత్తం కూరగాయల మార్కెట్, రైతు బజార్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ప్రజలు, వ్యాపారులను కలుసుకొని ఓట్లు అభ్యర్థించారు.

నేటినుంచి సీపీఎం నేత బాలకృష్ణన్ ప్రచారం

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి కే బాలకృష్ణన్ శనివారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారు. శనివారం కన్నియాకుమారిలో, ఆదివారం దిండుగల్‌లో, ఏప్రిల్ ఒకటిన తేనిలో, 2న విరుదునగర్‌లో ప్రచార సభలు, రోడ్‌షోలలో పాల్గొంటారని ఆ పార్టీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

దినకరన్ ప్రచారం... : ఇదిలా ఉండగా అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు టీటీవీ దినకరన్ ఏప్రిల్ ఒకటి నుంచి ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఏప్రిల్ 1 తూత్తుకుడి, తిరునల్వేలి, 2న తెన్‌కాశి, విరుదునగర్, 3న మదురై, తిరుచ్చి, 4న మైలాడుదురై, తంజావూరు నియోజకవర్గాలలో ప్రచార సభలు, రోడ్‌షోలలో పాల్గొంటారు. ఏప్రిల్ ఆరు నుండి కోయంబత్తూరు, ఏడున వేలూరు, ఎనిమిదిన తిరుచ్చిలో ఆయన ప్రచారం చేయనున్నారు.

రూ.2.4 లక్షలు స్వాధీనం

వేలూరు, మార్చి 29: చెన్నైకు చెందిన బట్టల వ్యాపారి జగదీశ్‌కుమార్ కారులో తగిన ఆధారాలు లేకుండా తీసుకొచ్చిన నగదును తమిళనాడు-ఆంధ్ర సరిహద్దుల్లోని ఉత్తరసికుప్పం చెక్‌పోస్ట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కారులో తరలిస్తున్న రూ.2,04,500 నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు, ట్రెజరీలో అప్పగించారు.

ప్రమాదంలో ఇద్దరు మెడికోల దుర్మరణం




మృతులు జయషిద్ధల్ ముండే, రిషికేశ్రమేశ్వర్ కుడ్డే (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మార్చి 29: పొల్లాచ్చి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వైద్య విద్యార్థులు మృతిచెందారు. పొల్లాచ్చి సమీపం కినత్తుకడవు కొండాంపట్టి ప్రాంతంలో సిద్ధ వైద్య కళాశాలలో మహారాష్ట్రకు చెందిన జయషిద్ధల్ ముండే(21), రిషికేశ్రమేశ్వర్ కుడ్డే (21) రెండవ సంవత్సరం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో, ఇరువురు ద్విచక్రవాహనంలో కోవై-పొల్లాచ్చి జాతీయ రహదారి అరసంపాళయం జంక్షన్ సమీంపంలో వస్తుండగా గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. కినత్తుకడవు పోలీసులు కేసు నమోదుచేసి, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నారు.

శ్రీరామచంద్ర వైద్యకళాశాలలో కొత్త సిములేషన్ ల్యాబ్

● 'మెడిసిమ్ వీఆర్'తో అవగాహన ఒప్పందం



అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న డాక్టర్ ఉమా శంకర్, ఆదిత్ చిన్నసామి

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూరులోని శ్రీరామచంద్ర ఉన్నతవిద్యా పరిశోధనా సంస్థ (డీమ్డ్ వర్సిటీ) ఆధ్వర్యంలోని వైద్యకళాశాలలో మెడికల్, పారామెడికల్ విద్యార్థులకు ప్రాక్టీసు పద్ధతులు నేర్చుకుని, ప్రతిభాపాటవాలు పెంచుకునేలా వర్చువల్ రియాలిటీ (వీఆర్) సిములేషన్ ట్రైనింగ్ ల్యాబ్ నెలకొల్పనున్నారు. ఆ ల్యాబ్‌ను మెడిసిమ్ వీఆర్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఆ వైద్యకళాశాలలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మెడిసిమ్ వీఆర్‌తో ఒప్పందం కుదిరింది. ఒప్పంద పత్రాలపై వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఉమా శంకర్, మెడిసిమ్ వీఆర్ సంస్థ సహవ్యవస్థాపకుడు డాక్టర్ ఆదిత్ చిన్నసామి సంతకాలు చేశారు.

మోదీకి బానిసగా మారిన ఎన్నికల సంఘం

● ఈవీకేఎస్ ఇళంగోవన్

అడయార్, మార్చి 29: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బానిసగా మారిపోయిందని కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్ ఇళంగోవన్ ఆరోపించారు. ఆయన ఈరోడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ, కోయంబత్తూరు లోక్‌సభకు పోటీచేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై దాఖలు చేసిన నామినేషన్ పత్రంలో అనేక లోటుపాట్లున్నాయని, అందువల్ల ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని ఒక్క బీజేపీ మినహా మిగిలిన అన్ని పార్టీలు డిమాండ్ చేస్తూ, ఈసీని కోరాయన్నారు. కానీ, కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలతో రిటర్నింగ్ అధికారి అన్నామలై నామినేషన్‌ను ఆమోదించి, ప్రధానికి ఈసీ బానిస కమిషన్‌గా మారిపోయిందన్నారు. అలాగే, ఈరోడ్ అన్నాడీఎంకే అభ్యర్థి ఆట్రల్ అశోక్ కుమార్‌కు చెందిన గోదాములో భారీ స్థాయిలో బహుమతులు సీజ్ చేశారని, కానీ, పోలీసులు, ఎన్నికల సంఘం అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అలాగే, అన్నాడీఎంకే అభ్యర్థికి చెందిన బ్యాంకుల్లో 250 నకిలీ ఖాతాలు సృష్టించి, ఓటర్లకు నగదు బట్వాడా చేస్తుందని, ఈ విషయంపై ఫిర్యాదు చేసిన చర్యలు శూన్యమన్నారు.

ప్రధాని రోడ్ షో విద్యార్థులు పాల్గొన్న కేసు.. పాఠశాల నిర్వాహకులపై చర్యలొద్దు: హైకోర్టు

పెరంబూర్, మార్చి 29: కోయంబత్తూర్‌లో ప్రధాని మోదీ రోడ్ షోలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్న వ్యవహారంలో ఏప్రిల్ 3వ తేదిలోగా అఫిడివిట్ దాఖలుచేయాలని పోలీసు శాఖకు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కోవైలో జరిగిన ప్రధాని రోడ్ షో జరిగిన సమయంలో సాయిబాబా కాలనీ ప్రాంతంలో ప్రధానికి ఆహ్వానం పలికేలా అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులను తరలించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ అధికారులకు కోవై జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి క్రాంతికుమార్ పాడి ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయమై పిల్లల సంక్షేమ భద్రతా సంఘం అధికారులు సాయిబాబా కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా సంబంధిత పాఠశాలల నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్, పిటిషన్‌పై ఏప్రిల్ 3వ తేదిలోపు అఫిడివిట్ దాఖలుచేయాలని పోలీసు శాఖకు నోటీసులు జారీచేయడంతో పాటు అప్పటివరకు పాఠశాలల నిర్వాహకులపై ఎలాంటి చర్యలు చేపట్టరాదని సూచించారు.


ఏటీఎంలలో చోరీలకు పాల్పడే గజదొంగ అరెస్టు



అరెస్టయిన తంబిరాజ్

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కేంద్రాల్లో చోరీలకు పాల్పడే గజదొంగ తంబిరాజ్‌ను కోయంబత్తూరు క్రైం పోలీసులు అరెస్టు చేశారు. తంబిరాజ్‌పై రాష్ట్రంలోనే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనూ చోరీ కేసులున్నట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది. తేని జిల్లా బోడినాయకనూరు సమీపం జక్కమ్మనాయకన్‌పట్టి ప్రాంతానికి చెందిన తంబిరాజ్ ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రాజేసేందుకు వచ్చేవారికి ఏటీఎం నుంచి సక్రమంగా డబ్బులు డ్రాచేసి ఇస్తానంటూ చెప్పి వారిచ్చే ఏటీఎం కార్డులు ఉపయోగించి చాకచక్యంగా నగదు అపహరించేవాడు. ఏటీఎం కార్డులు దారుడు తాము చెప్పిన దానికంటే అధికంగా డబ్బు ఖాతా నుండి డ్రా అయినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందేవారు. ఇలా తంబిరాజ్ నాలుగు రాష్ట్రాలలోనూ చోరీలకు పాల్పడి పోలీసుల కళ్ళుగప్పి తిరుగుతుండేవాడు. ఇటీవల ఓ ఏటీఎం కేంద్రం వద్ద చోరీచేస్తున్న తంబిరాజ్‌కు సంబంధించిన వీడియో ఓ సీసీ కెమెరా ద్వారా పోలీసులకు లభ్యమైంది. కోయంబత్తూరు క్రైం విభాగం పోలీసులు ఆ వీడియో ఆధారంగా తంబిరాజ్‌ను గుర్తించారు. రెండు రోజుల క్రితం తంబిరాజ్ స్వస్థలానికి వచ్చాడని తెలుసుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం అతడి ఇంటి వద్దకు వెళ్ళి అరెస్టు చేశారు.

ఆలయ గోవుకు కన్నీటి నివాళి



గోమాతకు పూజలు చేస్తున్న కుప్పుసామి కుటుంబీకులు, గ్రామస్థులు

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కరికాలి కోముట్టిపట్టి గ్రామంలో పెంచి న ఆలయ గోవు మృతి చెంటంతో స్థానికులు ఆ గోమాత భౌతికకాయానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఖననం చేసారు. ఆ గ్రామానికి చెందిన కుప్పుసామి అనే కేటరింగ్ మాస్టర్‌కు 24 యేళ క్రితం మగబిడ్డ జన్మించాడు. పుట్టినప్పటి నుండి ఆ బాలుడికి మాటలు రాలేదు. దీనితో ఆయన కరూరు తాంతోంద్రిమలై పెరుమాళ్ ఆలయానికి వెళ్ళి తన కుమారుడికి మాటలు వస్తే ఓ పసువును కానుకగా సమర్పిస్తానని మొక్కుకున్నాడు. ఎనిమిదేళ్లపాటు ఓ గోవును పెంచు తుండగా ఎనిమిదేళ్లకు ముందు కుమారుడికి మాటలు వచ్చాయి. అప్పటి నుండి ఊరివారంతా ఆ గోవును ఆలయ గోమాతగా భావించి మొక్కుతుండేవారు. అదే సమయంలో ఆ ఆవు ఇచ్చే పాలను కుప్పుసామి పేదలకు ఉచితంగా ఇచ్చేవాడు. ఆ గోవుకు పుట్టిన లేగదూడను కూడా ఆలయానికి కానుకగా సమర్పించి వాటిని పెంచారు. ఈ నేపథ్యంలో ఆలయ గోవు హఠాత్తుగా మరణిం చింది. దీంతో కుప్పుసామి కుటుంబీకులు, గ్రామస్థులు విలపించి శాస్త్రోక్తంగా ఆ ఆలయ గోవుకు అంత్యక్రియలు నిర్వహించారు.

హారతిచ్చిన మహిళలకు డబ్బులిచ్చిన అన్నామలై

● విచారణకు ఆదేశించిన ఎన్నికల అధికారి

పెరంబూర్, మార్చి 29: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు పార్టీల ప్రచార హోరు ఊపందుకుంది. తమ ప్రాంతాలకు వస్తున్న నేతలకు మహిళలు హారతులతో స్వాగతం పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో, కోయంబత్తూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న అన్నామలై, తనకు హారతిచ్చిన మహిళకు నగదు ఇస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని ఎన్నికల అధికారి పోలీసులకు ఆదేశించారు. ఈ విషయమై కోవై జిల్లా కలెక్టర్ తన ఎక్స్‌లో... ప్రసారమవుతున్న వీడియో పరిశీలించామని, ఈ వీడియోలోని వాస్తవాలు తెలుసుకొనేలా విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన వారికి నోటీసులు

పెరంబూర్, మార్చి 29: ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన 1,500 మంది నుంచి సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీచేసినట్లు చెన్నై ఎన్నికల అధికారి డా.జె.రాధాకృష్ణన్ తెలిపారు. ఆయన నగరంలో శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ... చెన్నై జిల్లా పరిధిలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల్లో 19,400 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేయనున్నారని తెలిపారు. వారికి తొలివిడత శిక్షణ ఈ నెల 24వ తేది నుంచి జరుగుతోందని, మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 16 శాసనసభ నియోజకవర్గాల్లో జరుగుతున్న శిక్షణకు 1,500 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. వారిలో ఎక్కువ మంది మెడికల్ లీవు తీసుకున్నట్లు తెలిసిందని తెలిపారు. తొలివిడత శిక్షణలో పాల్గొనలేని వారికి శనివారం నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు డా.జె.రాధాకృష్ణన్ తెలిపారు.

భిక్షగత్తె నుంచి రూ.1.50 లక్షలు స్వాధీనం

పెరంబూర్, మార్చి 29: తిరుప్పూర్ దక్షిణం శాసనసభ నియోజకవర్గ పరిధిలో గుణశేఖర్ నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నల్లూరు దేవాలయం ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో అటుగా వచ్చిన 36 ఏళ్ల మహిళ మద్యం మత్తులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అధికారులు ఆమె బ్యాగు తనిఖీ చేయగా రూ.1.50 లక్షల నాణేలు, కరెన్సీ నోట్లున్నట్లు తెలుసుకున్నారు. తాను తిరుచ్చి జిల్లా తురైయూర్ వాసి కాగా, మన్నారి అమ్మవారి ఆలయం ఎదుట భిక్షమెత్తుకుంటానని ఆ మహిళ అధికారులకు తెలిపింది. కానీ, ఎన్నికల కోడ్ అమలులో ఉండడం, ఆ నగదుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్న అధికారులు, కార్పొరేషన్ సహాయ కమిషనర్ తంగవేల్‌రాజన్‌కు అప్పగించారు. అలాగే, మద్యం మత్తులో ఉన్న ఆమెను ప్రభుత్వ హోంకు తరలించారు.


ఎన్నికల బాండ్లతో బీజేపీ అవినీతి గుట్టురట్టు



కోవై రోడ్‌షోలో పాల్గొన్న ఎంపీ కనిమొళి

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ పాలకుల అవినీతి గుట్టు రట్టయిందని డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవా చేశారు. కోయంబత్తూరులో డీఎంకే అభ్యర్థి గణపతి రాజ్‌కుమార్‌కు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. తుడియలూరు సంథైకడై ప్రాంతంలో ఆమె ప్రసంగిస్తూ కేంద్రంలోని బీజేపీ పాలకులు ప్రతిపక్ష పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల అభివృద్ధికి ఏ మాత్రం పాటుపడటం లేదని, మోదీ చేసే అబద్ధాలకు తమిళ ప్రజలెవరూ మోసపోరన్నారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్న మణిపూర్‌లో మారణహోమాలు ఎన్ని జరిగినా ప్రధాని మోదీ నిమ్మకు నీరెత్తినట్లున్నారని, ఒక్కసారి కూడా ఆ రాష్ట్రంలో పర్యటించి బాధితులను పరామర్శించలేదని కనిమొళి ఆరోపించారు.

● సీమాన్‌కు అచ్చిరాని గుర్తు?


కన్నియాకుమారి రోడ్‌షోలో మైక్ కోసం ఎదురుచూస్తున్న సీమాన్

ప్రచారంలో మొరాయించిన మైక్!

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ కట్చి నాయకుడు సీమాన్ కన్నియాకుమారి లోక్‌సభ నియోజకవర్గం, విలవంగోడు శాసన సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నప్పుడు మైక్ పనిచేయకుండా ఆయనను ముప్పుతిప్పలు పెట్టింది. నామ్ తమిళర్ కట్చి ఇదివరలో చెరకు రైతు గుర్తు ఉండేది. ఈ ఎన్నికల్లో కర్ణాటకు చెందిన ఓ ప్రాంతీయ పార్టీ ఆ గుర్తును దక్కించుకోవడంతో నామ్ తమిళర్ కట్చికి మైక్ చిహ్నం లభించింది. దీనితో సీమాన్ ఓపెన్ టాప్‌పై నిలిచి కన్నియాకుమారి చర్చ్ రోడ్డు వద్ద కార్డ్‌లెస్ మైక్ పట్టుకుని ప్రసంగిస్తుండగా ఉన్నట్టుండి అది మొరాయించింది. మైక్‌సెట్ అమర్చిన సిబ్బంది వైపు ఆయన పదేపదే మైక్‌ను సరిచేయమంటూ సైగలు చేశారు. ఇలా మూడుసార్లు మైక్ పనిచేయకపోవడంతో ఆయన విసుగు చెందారు. చివరకు వైరుతో ఉన్న మైక్ తెప్పించుకుని ప్రసంగించారు. సీమాన్ మైక్ పనిచేయకపోవడానికి గమనించిన జనాలు మైక్ గుర్తుకు ఆయనకు అచ్చిరాలేదంటూ గుసగుసలాడుకున్నారు.






చెన్నై రాజధాని కళాశాలలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈవీఎం నమూనా

విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గ డీఎండీకే అభ్యర్థి విజయ ప్రభాకరన్‌కు మద్దతుగా అన్నాడీఎంకే దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత వేషధారణలో ప్రచారం చేస్తున్న కళాకారులు

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

ఓటర్లకు సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం విజ్ఞప్తి

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో వంతుల వారీగా డీఎంకే, అన్నాడీఎంకేలకు అవకాశమిచ్చిన ప్రజలు.. ఒక్కసారి తనకు అవకాశమివ్వాలని ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉదయం ఆయన మింట్ స్ట్రీట్ పిళ్లయార్‌కోయిల్, తాత ముత్తయ్య వీధి, అన్నా వీధి, గోవిందప్ప వీధి, వరద ముత్తయ్యప్పన్ వీధి, గోడౌన్ వీధి, గోవిందప్ప వీధి, నారాయణ వీధి, జనరల్ ముత్తయ్య వీధి, ఇరులప్పన్ వీధి, పల్లమ్ హౌసింగ్ బోర్డు, జట్కాపురం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఓ రోడ్డు పక్కన హోటల్లో సాధారణ వ్యక్తిలా టిఫిన్ చేశారు. టిఫిన్ సెంటర్ కష్టనష్టాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాహనంపై ప్రచారం చేస్తూ ప్రసంగించారు. కేంద్రంలో వచ్చేది బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వమేనని, ఈసారి తనను గెలిపిస్తే కేంద్రం నుంచి కూడా భారీగా నిధులు రప్పించి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని హామీనిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ జనరంజకమైన పాలన అందిస్తున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నడచుకుంటున్న తనను కూడా ప్రజలు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.


హోటల్లో అల్పాహారం చేస్తున్న వినోజ్ పి.సెల్వం

● విలన్ నోట కామెడీ

కారులో పౌడర్ ఉంది పూసుకుంటారా?

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ కారు తనిఖీ చేయడానికి వెళ్ళిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు వింత అనుభవం ఎదురైంది. గుడియాత్తం సమీపం మేల్‌పట్టివద్ద కారులో వెళుతున్న ఆయనను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత తమ గుర్తింపు కార్డులను చూపి కారులో తనిఖీ జరిపారు. చివరకు కారు నెంబర్‌ను, అందులో ప్రయాణిస్తున్న వివరాలను అధికారులు తమ పుస్తకంలో రాసుకున్నారు. ఆ సమయంలో మన్సూర్ అలీ ఖాన్ వారితో మాట్లాడుతూ కారులో చిల్లర నాణేలు కూడా లేవని, అయితే ముఖానికి పూసుకునే పౌడర్ మాత్రం డబ్బాల కొద్దీ పడి ఉన్నాయని, ఆ పౌడర్‌ను పూసుకుంటారా? అని ప్రశ్నించారు. మన్సూర్ అలీఖాన్ ఉన్నట్టుండి పౌడర్ పూసుకుంటారా అని అడిగిన వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులలో ఉన్న ఓ మహిళ ఫక్కున నవ్వేశారు. వెంటనే తక్కిన అధికారులు కూడా నవ్వుకుంటూ అక్కడి నుండి వెళ్ళి పోయారు.


వేలూరు ఇండిపెండెంట్ అభ్యర్థి మన్సూర్ అలీఖాన్ కారును తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ మహిళా అధికారి



బొంగరం గుర్తుకు ఓటెయ్యండి ప్లీజ్!

● నోరు జారిన సీవీ షణ్ముగం

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మిత్రపక్షమైన డీఎండీకే గుర్తు ఢంకా అని తెలిసినా మాజీ మంత్రి సీవీ షణ్ముగం ఉన్నట్టుండి బొంగరం గుర్తుకు ఓటేసి గెలిపించాలంటూ పిలుపు నిచ్చి సభికులకు నవ్వు తెప్పించారు. కడలూరు లోక్‌సభ నియోజకవర్గం నిర్వాహకుల సమావేశం పన్రుట్టిలో ఏర్పాటైంది. ఆ సభలో పాల్గొన్న సీవీ షణ్ముగం ప్రసంగిస్తూ బీజేపీని తూర్పారబట్టారు. కడలూరులో అన్నాడీఎంకే కూటమి తరఫున పోటీ చేస్తున్న డీఎండీకే అభ్యర్థి శివకొళుందును బొంగరం గుర్తుపై ఓటేసి గెలిపించాలన్నారు. వెంటనే పక్కనే నిలిచిన పార్టీ ప్రముఖుడొకరు సారు గుర్తు మార్చేశారు... డీఎండీకే గుర్తు బొంగరం కాదు ఢంకా' అని చెప్పారు. వెంటనే సీవీ షణ్ముగం తప్పయిపోయింది క్షమించడండి ఢంకా గుర్తుపై ఓటేసి శివకొళుందును గెలిపించండి అంటూ తన మాటను సర్దుకున్నారు.

→ సీవీ షణ్ముగం చెవిలో డీఎండీకే గుర్తు మార్చేశారంటూ చెబుతున్న పార్టీ ప్రముఖుడు

● వందశాతం ఓట్ల కోసం


తిరుప్పూరులో వంద శాతం పోలింగ్ కోసం ఎగురుతున్న ప్రచార బెలూన్లు

ఆకాశంలో ఎగిరిన ప్రచార బెలూన్లు

చెన్నై, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరుప్పూరులో ఆ సంఘం అధికారులు 100 శాతం పోలింగ్ కోసం అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేశారు. 'తప్పకుండా ఓటేస్తాను... మీరు ఓటెయ్యండి' అంటూ నినాదాలు రాసి ఉన్న పెద్ద బెలూన్లను అధికారులు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తిరుప్పూరు కార్పొరేషన్ కమిషనర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పవన్‌కుమార్, సబ్ కలెక్టర్ కృత్తిక విజయన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థి పేరు కూడా తెలియని మాజీ మంత్రులు

● హయ్యో హయ్యో

పెరంబూర్, మార్చి 29: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థిగా పసుపతి పరిచయం కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వీరమణి మాట్లాడుతూ... ఈ నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఏసీ షణ్ముగం, డీఎంకే తరఫున మంత్రి దురైమురుగన్ కుమారుడు పోటీచేస్తున్నారని, ఇద్దరూ ధన, అధికార బలంతో బరిలో నిలిచారని, అన్నాడీఎంకే అభ్యర్థి ప్రజల తరఫున నిలిచాడని పేర్కొన్నారు.అలాగే, రాజ్యసభ ఎంపీ తంబిదురై కూడా మాట్లాడారు.ఈ సభలో పార్టీ అభ్యర్థి పేరు పసుపతి కాగా, మాజీ మంత్రి వీరమణి 'తిరుపతి' అని, ఎంపీ తంబిదురై 'భూపతి' అంటూ ప్రసంగించారు. దీంతో, అభ్యర్థి పేరు కూడా తెలియకుండా వచ్చి వీరు ఏం ప్రచారం చేస్తారు అంటూ ఖంగుతినడం కార్యకర్తల వంతైంది.

కరూర్‌లో ఒకే వర్గం అభ్యర్థుల పోటీ

● అక్కడంతే!

పెరంబూర్, మార్చి 29: కరూర్ లోక్‌సభ నియోజకవర్గంలో దిండుగల్ జిల్లాలోని వేడచందూర్, తిరుచ్చి జిల్లాలోని మనప్పారై, పుదుకోట, విరాలిమలై, కరూర్ జిల్లాలోని కరూర్, అవరకుర్చి, కృష్ణరాయపురం తదితర ఆరు శాసనసభ నియోజకవర్గాలున్నాయి. ఈ ఆరు నియోజకవర్గాల్లో కొంగు వెల్లాల్ గౌండర్, వెట్టువ గౌండర్, ఊరాళి గౌండర్, నాయకర్, వెల్లాలర్, ముక్కులత్తోర్, ముత్తరయర్, మైనార్టీలు అని అన్ని రకాల వర్గాల ప్రజలు ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో అన్నాడీఎంకే-డీఎంకే-కాంగ్రెస్ తదితర పార్టీలు కొంగు వెల్లాల్ గౌండర్ వర్గానికి చెందిన వారిని అభ్యర్థులుగా నిలిపాయి. ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున జ్యోతిమణి, అన్నాడీఎంకే తరఫున తంగవేల్, బీజేపీ తరఫున సెంథిల్ నాథన్, నామ్ తమిళర్ పార్టీ తరఫున కరుప్పయ్య పోటీచేస్తుండగా, వీరు నలుగురు కొంగు వెల్లాల్ గౌండర్ వర్గానికి చెందిన వారు. ఎన్నికల్లో వర్గ బలంతో పాటు ఆర్థిక బలం కూడా అవసరం. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో నగదు బట్వాడా అధికంగా జరిగే నియోజకవర్గంగా కరూర్ మారింది. అందువల్ల ఇతర వర్గాలు, ఇతర జిల్లాలకు చెందిన వారు ఈ నియోజకవర్గంలో పోటీచేసేందుకు ఆసక్తి చూపలేదు. తాజాగా ప్రకటించిన అభ్యర్థులతో కరూర్ నియోజకవర్గంలో ఒక వర్గం వారే పోటీచేస్తుండడం గమనార్హం.

విల్లుపురంలో మళ్ళీ డీపీఐ, పీఎంకే ఢీ

● పాత ప్రత్యర్థులే

చెన్నై,మార్చి29 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం లోక్‌సభ నియోజకవర్గంలో డీపీఐ, పీఎంకే పార్టీలు మళ్ళీ బరిలోకి దిగుతున్నాయి. ఈ రెండు పార్టీలు రెండోసారి తలపడనున్నాయి. అన్నాడీఎంకే తన సొంత బలాన్ని నమ్ముకుని ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తోంది. 2008 నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా దిండివనం లోక్‌సభ నియోజకవర్గం విల్లుపురం నియోజకవర్గంగా కొత్తగా ఏర్పడింది. ఈ నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత 2009లో అన్నాడీఎంతో డీఎంకే కూటమి తరఫున డీపీఐ పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థి ఆనందన్ గెలిచారు. 2014లో జరిగిన ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే పోటీపడ్డాయి. అన్నాడీఎంకే అభ్యర్థి రాజేంద్రన్ గెలిచారు. 2019లో అన్నాడీఎంకే బీజేపీ కూటమి తరఫున పీఎంకే అభ్యర్థిగా వడివేల్ రావణన్ పోటీ చేశారు. డీఎంకే కూటమిలోని డీపీఐ అభ్యర్థిగా రవికుమార్ ఉదయసూర్యుడి గుర్తుపై పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో రవికుమార్ గెలుపొందారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో ప్రధానంగా త్రిముఖ పోటీ నెలకొంది. డీఎంకే కూటమి తరఫున డీపీఐ అభ్యర్థిగా రవికుమార్ మళ్ళీ పోటీకి దిగారు. అన్నాడీఎంకే తరఫున కళ్లకుర్చి జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి భాగ్యరాజ్ పోటీ చేస్తున్నారు.ఎన్డీయే కూటమి తరఫున పీఎంకే అభ్యర్థిగా మురళీశంకర్ పోటీ చేస్తున్నారు.రవికుమార్ ఈసారి డీఎంకే గుర్తుపై కాకుండా ఎన్నికల సంఘం కేటాయించనున్న కొత్త గుర్తుపై పోటీ చేయనున్నారు. డీపీఐ చిహ్నమైన కుండ గుర్తు ఈసారి ఆ పార్టీకి కేటాయించలేదు. పీఎంకే అభ్యర్థి మురళీ శంకర్ పొరుగు జిల్లాకు చెందినవారై ఉన్నారు. డీపీఐ తరఫున మంత్రులు పొన్ముడి,మస్తాన్ తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. అన్నాడీఎంకే అభ్యర్థి భాగ్యరాజ్ తరఫున పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు కూడా తీవ్ర స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం అన్నాడీఎంకే అభ్యర్థి గెలుపు కోసం వ్యూహరచనలు చేసి ప్రచారం సాగిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో మూడు పార్టీల అభ్యర్థుల ప్రచార సరళిని పరిశీలిస్తే ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా స్వల్ప మెజారిటీతోనే గెలుస్తారని చెప్పవచ్చు.


డీపీఐ అభ్యర్థి రవికుమార్, పీఎంకే అభ్యర్థి మురళీశంకర్, అన్నాడీఎంకే అభ్యర్థి భాగ్యరాజ్

ఇంటి నుంచే ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగుల అనాసక్తి



పెరంబూర్, మార్చి 29: తపాలా ఓట్లు లాగే, వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల సంఘం అందిస్తున్న సదుపాయం వినియోగించుకొనేందుకు ఆసక్తి చూపడం లేదు. వారు పోలింగ్ కేంద్రానికే వెళ్లి ఓటు వేయాలని భావిస్తున్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం ఈసీ కల్పించింది. ఆ ప్రకారం, అధికారులు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి '12 డి' అనే ఫారం అందజేస్తున్నారు. వారు ఆ ఫారం పూర్తిచేసి సంబంధిత అధికారులకు అందజేయాలి. పోలింగ్ రోజున ఎన్నికల అధికారులు వారింటికే వెళ్లి వారి ఓటును నమోదుచేసుకుంటారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో 6,13,991 మంది 85 ఏళ్ల పైబడిన ఓటర్లుండగా, దివ్యాంగులు 4,61,730 మంది ఉన్నట్లు అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఇక, వృద్ధుల్లో 4,30,734 మందికి ఎన్నికల అధికారులు '12 డి' ఫారాలు అందజేయగా, వారిలో 77,445 మంది మాత్రమే ఫారం పూర్తిచేసి అధికారులకు అందజేశారు. అలాగే, 3,65,875 మంది దివ్యాంగులకు ఫారాలు అందజేయగా, 50,676 మంది మాత్రమే ఫారాలు పూర్తిచేసి అందించారు. ఈ లెక్క ప్రకారం వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకే వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలుస్తోంది. కానీ, వీరు పోలింగ్ కేంద్రానికి ఓటు హక్కు వినియోగించుకుంటారా? ఎండలో ఎందుకు పోవడం అనుకుంటారా? అనే సందిగ్ధంలో ఎన్నికల అధికారులు పడిపోయారు.

అభ్యర్థుల కంటే దీటుగా ఎన్నికల ప్రచారంలో ఈసీ


సేలంలోని మహిళా కళాశాలల్లో ఓటు హక్కు అవగాహన కార్యక్రమంలో వీణ వాయిస్తున్న ఎన్నికల అధికారి లక్ష్మి

పెరంబూర్, మార్చి 29: లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల కంటే దీటుగా ఎన్నికల ప్రచారంలో ఎన్నికల కమిషన్ దూసుకుపోతోంది. కాకపోతే, అభ్యర్థులు తమకు ఓటేయాలని ప్రచారం చేస్తుండగా, 100 శాతం ఓటు హక్కు వినియోగించుకొనేలా అందరూ ఓట్లు వేయాలని ఎన్నికల కమిషన్ అవగాహన ప్రచారం చేపట్టింది. దేశంలో లోక్‌సభ ఓటింగ్ శాతం సరాసరి 65 శాతానికి పైగా ఉండగా, రాష్ట్రంలో 75 శాతానికి పైగా నమోదవుతోంది. ఓటింగ్ శాతాన్ని పెంచేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రచారాలు చేపడుతోంది. మారథాన్, కబడ్డీ, ముగ్గుల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ, తాగు లాగుడు పోటీలు, గ్యాస్ సిలిండర్లు, బస్సులు, వాహనాలపై స్టిక్కర్లు అంటించడం తదితరాలు చేపట్టడంతో పాటు ప్రతి వీధి, పాఠశాలలు, కళాశాలల ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటుచేసింది. అలాగే, శుభలేఖల్లా ఆహ్వాన లేఖలు కూడా ఇంటింటికి వెళ్లి అందజేస్తోంది. వాటిలో 'ఓటు హక్కు వినియోగించుకోవాలి', '100 శాతం ఓటింగ్ నమోదుకు కృషి చేద్దాం' తదితర వ్యాఖ్యానాలతో పాటు ప్రచారంలో అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేయడం, నగదు బట్వాడా, కుల, మతాల గురించి ప్రస్తావన, ఎన్నికల కోడ్ ఉల్లంఘన తదితరాలపై ఫిర్యాదు చేసేలా టోల్ ఫ్రీ నెంబర్లు కూడా ఉన్నాయి. మొత్తం మీద రాజకీయ పార్టీలు చేపడుతున్న సుడిగాలి ప్రచారానికి దీటుగా ఎన్నికల సంఘం కూడా ముమ్మరం ప్రచారం చేపడుతోంది. కాగా, లోక్‌సభ ఎన్నికల ఖర్చుల కోసం రూ.750 కోట్లు కేటాయించాలని రాష్ట్రప్రభుత్వాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరడం గమనార్హం.


మైలాడుదురైలో ఓటర్లకు తాంబూలం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

వరుడిమెడలో తాళి కట్టిన వధువు

● 'హాట్‌స్పాట్' కోసం వినూత్న ప్రచారం

ఆదిత్య భాస్కర్ - గౌరి కిషన్ జంటగా నటించిన చిత్రం 'హాట్‌స్పాట్'. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం ప్రచారం కోసం మూవీ మేకర్స్ వినూత్నంగా ఆలోచన చేశారు. సినిమాలో హీరోహీరోయిన్లు వివాహం చేసుకుంటారు. అయితే, సంప్రదాయానికి విరుద్ధంగా వరుడు మెడలో వధువు తాళి కడుతున్నట్టుగా ఫొటోను గౌరి కిషన్ తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేశారు. అయితే, ఇది చూసిన అనేక మంది ఆదిత్య భాస్కర్, గౌరి కిషన్ నిజంగానే పెళ్ళి చేసుకున్నట్టుగా వారి అభిమానులు నమ్మేశారు. దీంతో ఆమె క్లారిటీ ఇచ్చారు. 'హాట్‌స్పాట్ మూవీ ప్రచారంలో భాగంగానే ఈ ఫొటోను షేర్ చేసినట్టు తెలిపారు. కాగా, ఈ సినిమా ఆదిత్య భాస్కర్, గౌరికిషన్‌ల రెండో చిత్రం. గతంలో '96' చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించారు.

ఆదిత్య భాస్కర్ మెడలో తాళికడుతున్న గౌరికిషన్



'ఫ్యామిలీ స్టార్' ఫుల్‌మీల్స్ ఎంటర్‌టైనర్

● నిర్మాత దిల్ రాజు

పరశురామ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాగూర్ జంటగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' మూవీ ఫుల్ మీల్స్ ఎంటర్‌టైనర్ అని ఆ చిత్ర నిర్మాత దిల్ రాజు అన్నారు. ఇందులో ప్రేమ, ఫైట్స్, కామెడీ, ఎమోషన్ ఇలా అన్ని సమపాళ్ళలో ఉన్నాయన్నారు. తమిళం, తెలుగు భాషల్లో ఏప్రిల్ 5న, ఆ తర్వాత హిందీలో విడుదలకానున్న ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నగరంలో నిర్మాత దిల్ రాజు, హీరో విజయ్ దేవరకొండ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో దిల్ రాజు మాట్లాడుతూ, 'తమిళనాడులో సాంబార్ ఇడ్లీ, కుంభకోణం కాఫీ, తాళి ఎంతో ఫేమస్ అని, ఈ మూడు కలగలిసిన చిత్రంగా మా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఉంటుంది. ఫైట్స్, కామెడీ, భావోద్వేగాలు అన్నీ పక్కా సమ్మర్ ఎంటర్‌టైనర్ ఇది. ఒక కుటుంబాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్ళే ప్రతి మనిషీ ఫ్యామిలీ స్టారే. ఈ సినిమా చూశాక చాలామంది ఫ్యామిలీ స్టార్స్‌లా మారుతారు. ఇది ప్రతి ఒక్కరినీ ఎంటర్‌టైన్ చేస్తుంది. విజయ్ దేవరకొండకు ఇప్పటివరకు రౌడీ అనే ముద్దుపేరుంది. ఈ సినిమా తర్వాత అది ఫ్యామిలీ స్టార్‌గా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కంటెంట్ ఉన్న చిత్రాలు నిర్మాతకు కాసుల వర్షం కురిపిస్తాయి. అలాంటిదే మా బ్యానర్‌లో వచ్చిన 'బలగం' చిత్రం. ఈ సినిమాకు దాదాపు వందకుపైగా అవార్డులు వచ్చాయి' అని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, 'నాకు కోలీవుడ్‌లో కూడా అభిమానులున్నారు. 'అర్జున్ రెడ్డి' సినిమాతో ఈ ఫ్యాన్స్ ఫాలోయింగ్ మొదలైంది. నేను నటించిన ప్రతి చిత్రం తమిళంలోకి అనువాదమవుతుంది. ఇది 'గీతగోవిందం' కంటే రెట్టింపు స్థాయిలో ఉంటుంది. ఖచ్చితంగా ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేస్తారు. కేవలం ఒక జోనర్‌లోనే ఇమిడిపోవాలన్న ఉద్దేశం లేదు. పలువురు తమిళ దర్శకులతో చర్చలు జరుగుతున్నాయి. అవి ఫలిస్తే కోలీవుడ్ దర్శకుడి డైరెక్షన్‌లో ఓ చిత్రం చేస్తాను' అన్నారు. మీడియా సమావేశంలో ఈ చిత్రాన్ని తమిళంలో రిలీజ్ చేస్తున్న నిర్మాత స్వరూప్ రెడ్డి కూడా పాల్గొన్నారు.


విజయ్ దేవరకొండ, దిల్ రాజు, స్వరూప్ రెడ్డి

సినిమా నిర్మాణం ప్రసవంతో సమానం

● సీనియర్ నటి దేవయాని

చిత్రజ్యోతి

చిత్ర నిర్మాణం ప్రసవంతో సమానమని సీనియర్ నటి దేవయాని అన్నారు. హీరో పార్తిబన్, దేవయాని, నందితా దాస్ జంటగా నటించిన చిత్రం 'అళగి'. 22 యేళ్ళ క్రితం రిలీజ్ చేయగా ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని శుక్రవారం రీరిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం గురువారం రాత్రి నగరంలో మీడియా సమావేశం ఏర్పాటుచేసింది. ఇందులో దేవయాని మాట్లాడుతూ, 'ఈ సినిమా నిర్మాణ సమయంలో మళ్ళీ రీ రిలీజ్ చేసే స్థాయిలో ఈ చిత్రం ఉంటుందని ఎవరూ ఊహించలేదు. 22 యేళ్ళ తర్వాత ఈ సినిమాను రీ రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. ఇందులో నటించిన వారంతా మళ్ళీ ఒకరినొకరు చూసుకునే అవకాశం కల్పించినందుకు నిర్మాతకు ధన్యవాదాలు. ఇలాంటి మంచి చిత్రాలను రీ రిలీజ్ చేసి, నేటి యువతరం చూసేలా ప్రచారం చేయాలి' అని కోరారు. హీరో పార్తిబన్ మాట్లాడుతూ, 'అళగి' చిత్రానికి సీక్వెల్ ఎపుడు తీస్తారా అని ఎదురు చూస్తున్నాను. దర్శకుడు తంగర్ బచ్చాన్ ఒక అద్భుతమైన కథా రచయిత. ఈ సినిమాకు ఆయన కాకుండా మరో దర్శకుడైయితే ఈ రీతిలో డైరెక్ట్ చేసివుండేవారు కాదు. ఇపుడు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తంగర్ బచ్చాన్‌కు ముందుగానే అభినందనలు. ఇందులో దేవయాని ఒక మ్యాజిక్. ఇపుడు రీ రిలీజ్ అవుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, సీక్వెల్ చిత్రాన్ని నిర్మించాలని కోరుతున్నాను' అని పేర్కొన్నారు. నిర్మాత ఉదయకుమార్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరి ముఖాల్లో 'అళగి' విజయం వెలుగులు కనిపిస్తున్నాయి. ఇందుకోసం వారు ఎంతగానో కష్టపడి వుంటారు. బన్రుట్టిలో చిన్నచిన్న ఇళ్ళలో ఉంటూ వారు నటించారు. 22 యేళ్ళ తర్వాత వీరందరినీ మళ్ళీ చూడటం సుదీర్ఘకాలం తర్వాత ఒక స్నేహితుడిని చూసినట్టుగా ఉంది. గత 20 యేళ్ళుగా చిత్రపరిశ్రమకు దూరంగా ఉన్నారు. ఈ సినిమా రీరిలీజ్ ద్వారా మళ్ళీ అడుగుపెడుతున్నాను' అని పేర్కొన్నారు. కాగా, 'అళగి' చిత్రాన్ని లేటెస్ట్ టెక్నాలజీలో శుక్రవారం రీరిలీజ్ చేశారు.


'అళగి' రీరిలీజ్ ఈవెంట్‌లో పార్తిబన్, దేవయాని తదితరులు